చక్రధర్ శ్రావణి బెడ్ దగ్గరికి వెళ్లేసరికి 'శ్రావణికి ఏం కాలేదు కానీ షాకులో ఉండడం వల్ల నిద్రమాత్రలిచ్చామని' డాక్టరు చెప్పడంతో ఊపిరి పీల్చుకుని ఆమె పక్కన కూర్చున్నాడు.

సాయంత్రానికి శ్రావణికి మెలకువ వచ్చింది. పక్కనే అంటి పెట్టుకుని కూర్చున్న చక్రధర్ని చూడగానే వెయ్యి ఏనుగుల బలమొచ్చింది. గట్టిగా అతనికి కరుచుకుపోయి "నేను తప్పు చేశానండీ అందుకే దేవుడు శిక్షించాడు" అని ఏడవసాగింది.

"ఛ..ఛ అదేం లేదు. నిన్ను ఊరడించమని ఆయనే పంపించాడు" నవ్వుతూ అని "పద మనం మీ ఊరు వెళదాం" అన్నాడు.

గృహప్రవేశానికి విచ్చేసిన అల్లుళ్ని కూతుర్నీ సాదరంగా ఆహ్వానించాడు పరంధామయ్యగారు.

"కొడుకులూ..కోడళ్లూ..కూతుళ్లూ..అల్లుళ్లూ పండగలకి వస్తే ఇబ్బంది లేకుండా ఉండాలని అన్ని వాటాలూ అన్ని ఫెసిలిటీలతోటీ కట్టించానయ్యా..నాకిప్పుడు ఎంత ఆనందంగా ఉందో.. అందరితో ఈ ఇల్లు కళకళలాడుతుంటే నాకింకేం కావాలయ్యా? ఆ రెండో వాటా మీది" అని చూపించాడు.

తండ్రి ఆనందాన్ని శ్రావణి కళ్లలో ముందే చూసేశాడు చక్రధర్. అతనికి కూడా మొట్టమొదటిసారి చాలా సంతోషంగా అనిపించింది. ఆటవిడుపుగా అనిపించింది.

గృహప్రవేశ వేడుక ఆడంబరంగా జరిగింది. అంతటా..అన్నిటా తానై హడావిడి చేశాడు చక్రధర్.

ఆ మధ్యాహ్నం భోజనాలు చేస్తూ "అల్లుడుగారూ ఈ శుభకార్యానికి మీరు రావడం మాకెంతో ఆనందాన్ని కలిగించింది. ఇలాగే వచ్చేనెల్లో జరిగే నా పెద్ద మనవడి ఉపనయనానికి మూడు నెల్ల తర్వాత జరిగే నా చెల్లెలి కూతురి పెళ్లికి తప్పకుండా రావాలి" అన్నాడు పరంధామయ్యగారు.

శ్రావణి భర్త వంక చూసింది. చక్రధర్ నవ్వుతూ తల ఊపాడు వస్తానన్నట్లుగా.

ఆ రాత్రి తమకు కేటాయించిన రూములో మెత్తటి పరుపుతో ఉన్న మంచం మీద పడుకుని పుస్తకం చదువుతున్నాడు చక్రధర్.

శ్రావణి వాళ్లమ్మకి పనుల్లో సాయం చేసి రాత్రి పదకొండు గంటలకి గదిలోకొచ్చింది. భర్త పక్కన కూర్చుని కళ్లనీళ్లు పెట్టుకుంది. చక్రధర్ పుస్తకం పక్కన పెట్టి భార్య భుజం మీద చెయ్యి వేసి దగ్గరికి తీసుకున్నాడు.

"ఏమండీ ఆ బస్సు ప్రమాదం తల్చుకుంటుంటే ఒళ్లు గగుర్పొడుస్తోంది. అసలంత మూర్ఖంగా నేనెలా ప్రవర్తించానో నాకే అర్థం కావడం లేదు. నేను తప్పు చేశాను క్షమించండీ" అంది.

"నువ్వు కాదు నిజానికి తప్పు చేసింది నేను నిన్ను నొప్పించాను. క్షణికావేశంలో ఎటువంటి పొరపాట్లూ చెయ్యకు. నువ్వేమన్నా అయితే నేను బ్రతగ్గలనా? నువ్వు ఒక్క పూట ఇంట్లో లేకపోయేసరికి ఆ లోటుని భరించలేకపోయాను. ఇంక నువ్వు శాశ్వతంగా వద్దు ఇహ నుంచీ మనమధ్య నో పోట్లాటలు..నో గొడవలు. మన మధ్య ప్రేమసంధి కుదిరింది. ఆనందంగా జీవిద్దాము..మనకి పుట్టబోయే పిల్లల్ని ఆరోగ్యకర వాతావరణంలో పెంచుదాం" అన్నాడు.

ఆ రాత్రి వాళ్ల జీవితంలో మొదటి రాత్రంత తియ్యగా.. మధురంగా నిలిచిపోయింది.

**-ప్రతాప వెంకట సుబ్బారాయుడు**
(సికిందరాబాద్)

# గృహప్రవేశం

## ధనుంజయ్, రమణిల సొంత ఇంటి కల నెరవేరబోతోంది.

పది రోజుల్లోనే గృహప్రవేశం. ఆహ్వానించవలసిన బంధు మిత్రుల అడ్రసులు, ఫోన్ నెంబర్లు ఒక లిస్ట్ తయారుచేశారు.

"రమణీ, నేను ఆఫీసుకెళ్లొచ్చేలోపల లిస్టంతా ఒకసారి చెక్ చెయ్యి. ఎవర్నయినా మర్చిపోతే తెలుస్తుంది. గుర్తొస్తే అందులో యాడ్ చెయ్యి" అన్నాడు ధనుంజయ్.

రమణి తల ఊపింది.

"ప్రెస్‌వాడు ఫోన్ చేశాడు. ఇన్విటేషన్లు రెడీగా ఉన్నాయట. వచ్చేటప్పుడు తెస్తాను" అంటూ స్కూటరెక్కి వెళ్లిపోయాడు.

రమణి లిస్టంతా ఒకసారి చదవసాగింది. దాదాపుగా అందరి అడ్రసులూ ఉన్నాయి.

రమణికి కుక్కుటేశ్వర్రావు గుర్తొచ్చాడు. లిస్టంతా మరొకసారి సరిచూసింది.

నిజమే కుక్కుటేశ్వర్రావు పేరు లిస్ట్‌లో లేదు. అతను ధనుంజయ్‌కి క్లోజ్ ఫ్రెండ్. గుంటూరులో చదువుకున్నప్పుడు క్లాస్‌మేట్స్. ఇప్పుడు గూడా గుంటూర్లోనే ఉంటున్నాడు. బిజినెస్ పనుల మీద వచ్చినప్పుడు ఇంటికి వస్తుంటాడు.

ధనుంజయ్ సెల్‌కి రింగ్ చేసింది రమణి.

"ఏమండీ లిస్ట్‌లో మీ క్లోజ్‌ఫ్రెండ్ కుక్కుటేశ్వర్రావు పేరు లేదు. ఎలా మర్చిపోయారు?"

"మర్చిపోలేదులే. ఆఫీసుకి వస్తాడు. పర్సనల్‌గా చెప్పాలనుకున్నాను. వాడు రాకపోయినా నేను ఎటూ మనవాళ్లందరినీ పర్సనల్‌గా కలిసి ఇన్విటేషన్లు ఇవ్వడానికి గుంటూరు వెళ్తున్నానుగా. అప్పుడు కలుస్తాను" అన్నాడు.

నిజమే. చుట్టాలను స్వయంగా పిలిస్తేగానీ రారు. లేకపోతే కొందరు అలుగుతారు.

* * *

ధనుంజయ్, రమణిల గృహప్రవేశం జరిగిపోయింది. బంధుమిత్రులంతా వచ్చి అభినందించారు. అది నగర శివార్లలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న కాలనీ. ధనుంజయ్ మూడు వందల గజాల స్థలంలో ఇల్లు కట్టినందుకు అంతా అదృష్టవంతుడవని పొగిడారు. ఇల్లు కట్టడానికి ఎన్ని లక్షలైందీ, ఎంత లోన్ తీసుకున్నావని వివరాలు అడిగారు కొందరు.

గృహప్రవేశం సందడి తగ్గిన తర్వాత హఠాత్తుగా రమణికి కుక్కుటేశ్వర్రావు గుర్తుకొచ్చాడు.

"ఏమిటి మీ ఫ్రెండ్ కుక్కుటేశ్వర్రావు రాలేదు? మీరు గుంటూరెళ్లి పర్సనల్‌గా పిలిచారుగా?"

"వాడు బిజినెస్‌మేన్. ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి వీలవుతుందా?" అన్నాడు ధనుంజయ్.

పది రోజుల తర్వాత ధనుంజయ్ ఇంటికి రాగానే చెప్పింది రమణి.

"ఏమండీ మీ ఫ్రెండ్ కుక్కుటేశ్వర్రావు నా సెల్‌కి ఫోన్ చేశాడు. మీ సెల్‌కి ఎన్నిసార్లు రింగ్ చేసినా లైన్ కలవలేదంట."

"అలాగా! నేను పని మీద బైటికి వెళ్లాలే. ఆ ట్రాఫిక్‌లో ఎప్పుడో చేసి ఉంటాడు" అన్నాడు.

"ఔనూ! మన ఇంటి గృహప్రవేశానికి ఆయన్ని పిలవలేదంటగా" అన్నది రమణి.

"మర్చిపోయానే! అది సరే వాడిని గానీ ఇంటికి రమ్మని చెప్పావా ఏం కొంపదీసి" ఆందోళనగా అన్నాడు ధనుంజయ్.

"చెప్పాను. ఏం?"

"చచ్చాం పో"

"ఏం? ఎందుకలా వర్రీ అవుతున్నారు. ఇదివరకెప్పుడూ మన ఇంటికి పిల్చేవారుగా?"

"అప్పుడంటే మనం అద్దెకుండేవాళ్లం. ఇప్పుడు సొంత ఇంట్లో ఉంటున్నాం. అందులోనూ కొత్త ఇల్లు. వాడొచ్చాడంటే వాస్తుశాస్త్రం మొత్తం తిరగేసి అది బాగాలేదు, ఇది బాగాలేదు, ఈ వంటిల్లు ఇక్కడుండగూడదు అని లేనిపోనివి చెప్పి బుర్ర తినేస్తాడు. మనం ఇప్పుడు మళ్లీ పగలగొట్టించి వాడు చెప్పిన మార్పులేం చెయ్యలేం. కాస్త పాతబడ్డాక పిలుద్దాం. అంతా బాగానే ఉన్నాం లేరా అని చెప్పొచ్చు. వాడు వచ్చి చెప్పాక మనకి గూడా లోపల పీకుతుంటుంది. లేనిపోని అనుమానాలు"

రమణి ధనుంజయ్‌వైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఐతే మీరు కావాలనే కుక్కుటేశ్వర్రావుని పిలవలేదన్న మాట" అని నవ్వింది రమణి.

ధనుంజయ్ భార్య నవ్వుతో శృతి కలిపాడు.

"మనం గూడా వాస్తు ప్రకారమే ఇల్లు కట్టించాం గదా!" అడిగింది రమణి.

"నర్లే! వాస్తు సిద్ధాంతాలు కోకొల్లలు. ఒకరికి ప్రమాదం అనిపించి చెప్పింది మరొకరికి నచ్చదు. లేనిపోని వంకలు పెట్టి మనకి వర్రీ పెడతారు" అన్నాడు ధనుంజయ్.

ధనుంజయ్ సెల్ రింగైంది.

"నేనేరా! సారీ రా! మీ ఇంటికి రావడం కుదర్లేదు. చెల్లాయి మరీ మరీ చెప్పింది రమ్మని. గృహప్రవేశానికి గూడా రాలేదని నిష్ఠూరాలాడింది. నాకు కార్డ్ రాలేదు. అందుకే రాలేదు. ఈసారి ట్రై చేస్తాలే" కుక్కుటేశ్వర్రావే మాట్లాడాడు.

"భలేవాడివిరా! నా కార్డ్ రాకపోవడం ఏమిటి? వారం రోజుల ముందు పోస్ట్ చేశాను" అన్నాడు ధనుంజయ్ భార్యవైపు చూసి కన్నుగీటుతూ. "సరే..సరే..వీలైనప్పుడు తప్పకుండా రా!" అన్నాడు ధనుంజయ్.

"హమ్మయ్య. ఎక్కడ తగలబడతాడోనని వర్రీ పడిపోయాను" అని నిట్టూర్చాడు ధనుంజయ్.

**-వాణిశ్రీ** (హైదరాబాద్)